క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి
- విద్యార్థినులను అభినందించిన ఉపాధ్యాయులు



సర్టిఫికెట్లతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి పేర్కొన్నారు. శనివారం జడ్చర్లలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాధిక, అశ్విని, సుజాత, గణిత, అక్షిత, శ్రీజ ప్రతిభ చాటి మొదటిస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి దేవి, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థులను అభినందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

ఎస్ఐ విమల



అవగాహన కల్పిస్తున్న విమల

బంట్వారం: గీత కార్మికులు కల్లు కంపౌండ్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ విమల సూచించారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఆమె బంట్వారం మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో గీత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సీసీ కెమెరాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. వాటితో నేరాలు అదుపుచేయొచ్చన్నారు. దాడులు, దోపిడీలు సంభవించినప్పుడు నేరస్తులను సులువుగా గుర్తించొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గీత కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన డీసీసీ అభిప్రాయ సేకరణ



జ్ఞాపిక అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి కోసం 13వ తేదీ నుంచి జిల్లాలో ఏఐసీసీ అబ్జర్వర్ సూరజ్‌సింగ్ ఠాకూర్ బృందం పర్యటించింది. కొత్త అధక్షుని ఎంపిక విషయంలో క్షేత్రస్థాయి అభిప్రాయ సేకరణలో భాగంగా అన్ని మండలాల్లో, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు. అనంతరం ఆదివారం ఆయనకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి శాలువా కప్పి, అనంత పద్మనాభ స్వామి ప్రతిమ అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి, సతీష్‌రెడ్డి, హన్మంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు



ఇరుముడి కట్టుకున్న స్వాములు

అనంతగిరి: అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమలకు పాదయాత్రగా బయలు దేరారు. ఆదివారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి పూజ నిర్వహించారు. అనంతరం సంజయ్ గురుస్వామి, మహేందర్ గురుస్వామి, ధనంజయ్ చారి గురుస్వామి, శ్రీకాంత్ గురుస్వామి, సాయికుమార్ గద స్వామి, సంతోశ్ గజాస్వామి, విక్రమ్ గంట స్వామి, సామల్ కత్తి స్వామి, సిద్ధు కత్తి స్వామి తదితరులు శబరిమలై వైపు పాదయాత్రగా బయలు దేరారు.

పనులు పూర్తి చేయాలి

కొత్తూరు: పట్టణంలో డ్వాక్రా భవనం సమీపంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. గత మూడేళ్ల క్రితం ప్రారంభమైన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. దీంతో వ్యాపారులు రోడ్ల పక్కనే విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు.

కంకణాపల్లి వాగు దాటేదెలా?



పారుతున్న వాగు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న మల్‌శెట్టిపల్లి తండావాసులు
- ప్రమాదల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- వంతెన నిర్మించాలని వినతి

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని కంకణాపల్లి వాగుపై వంతెన లేకపోవడంతో మల్‌శెట్టిపల్లి తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని దాటాలంటే వాహనదారులు, గిరిజనులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని సార్లు ప్రమాదాల బారిన గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక వర్షా కాలం వాగు దాటడం చాలా కష్టం. తండా వాసుల రాకపోకలకు వేరే మార్గం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో వాగునుంచే వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఏళ్ల తరబడి ఈ సమస్య తాము ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం వాగు పారడంతో సీసీ బెడ్‌పై నాచు పట్టి జారిపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, కాలి నడకన వెళ్లే వారు తరచూ కింద పడి గాయాలపాలవుతున్నారు. సీసీ బెడ్‌పై నుంచి నీరు పారడం తగ్గే వరకు నాచు అలాగే ఉంటుంది. సీసీ బెడ్‌పై నుంచి పారే నీరు ఇప్పట్లో తగ్గదని చెబుతున్నారు. తండాకు వెళ్లే వాహనాలు పొరపాటున ఎడమ వైపు కింద దిగితే ఇక అంతే సంగతులు. ఆ వైపులో నీరు చాలా లోతుగా ఉంటుందని, ఈత రాని వారు ప్రాణాలు కోల్పోవాల్సిందేనని చెబుతున్నారు. వంతెన నిర్మాణం కోసం గిరిజనులు చాలా కాలంగా పాలకులకు విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వివరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత పీఆర్ డీఈ జితేందర్‌ను సంప్రదించగా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

నిరంతరం పారుతూనే ఉంటుంది



వానా కాలం వాగు దాటడం చాలా కష్టంగా ఉంటుంది. బ్రిడ్జి లేకపోవడంతో నిరంతరం వాగు పారుతూనే ఉంటుంది. వర్షాకాలంలో వరద ఉధృతి తగ్గే వరకు ఎక్కడి వారు అక్కడే ఉండాల్సిన పరిస్థితి. వాగులో నుంచి తాత్కాలికంగా వేసిన సీసీ బెడ్‌పై నాచు పట్టి ప్రమాదకరంగా తయారైంది. దీన్ని దాటే క్రమంలో వాహనదారులు, పాదచారులు జారి పడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– నాన్యనాయక్, మల్‌శెట్టిపల్లి తండా

మెడికల్ కళాశాల, గురుకులాలు తరలించొద్దు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కేడీపీ జేఏసీ నాయకులు

- కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలి
- పట్టణంలో కేడీపీ జేఏసీ బైక్ ర్యాలీ

కొడంగల్ రూరల్: మెడికల్ కళాశాల, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలు, సమీకృత గురుకులాలను తరలించొద్దని కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ(కేడీపీ జేఏసీ)కన్వీనర్ కోట్రికె లక్ష్మీనారాయణ గుప్తా, కో కన్వీనర్లు గంటి సురేశ్ కుమార్, యూ.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి వినాయక చౌరస్తా మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు, సమీకృత గురుకులాల తరలింపును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని సంవత్సరం గడిచినా నిర్మించేందుకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కేడీపీ సభ్యులు ఎస్ఎం.గౌసన్, ఆనంద్‌లాహోటి, నందారం రాజేందర్, పవన్‌లాహోటి, సూర్యానాయక్, షాకీర్, రవిందర్‌నాయక్, భీమరాజ్, ఎరన్‌పల్లి వెంకటయ్య, ప్రవీణ్, శివకుమార్, కిషన్‌సంగ్, చిన్నయ్య, పకీరప్ప శ్రీనివాస్, దేవరాజ్, అరవింద్, పాండ్యానాయక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



కుల్కచర్ల: ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల పథసంచలన్



పరిగి: పథసంచలన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

బీజేపీ జిల్లా కన్వీనర్ ప్రహ్లాదరావు

కుల్కచర్ల: సమాజసేవే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని బీజేపీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాదరావు పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలో పథసంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజల్లో జాతీయభావాన్ని పెంపొందించడమే కాకుండ దేశ సేవకు తమ జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సంఘ నాయకులు కంకంటి ఆంజనేయులు, రవి, రమేశ్, శ్రీనివాస్, రాఘవేందర్, జానకిరాం, రాజేశ్వర్, నవీన్, శివకుమార్, నరేశ్, చంద్రకాంత్, సాయికుమార్, స్థానిక నాయకులు హరికృష్ణ, చంద్రలింగం, చౌడాపూర్ శ్రీనివాసులు, రవిచందర్, ప్రకాశ్ రెడ్డి, బాల్ రెడ్డి, కాంగారి ఆంజనేయులు, సామ్యారెడ్డి, రాకేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు రావాలి

పరిగి: సమాజంలో పరివర్తన దిశగా మార్పు రావాలని క్షేత్ర సామాజిక సమరసత ప్రముక్ అప్పల ప్రసాద్ జీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో పథసంచలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి నిస్వార్థంగా సేవలందించడమే సంఘ్ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజల్లో దేశభక్తి పెంపొందించడం, హిందూ సమాజాన్ని జాగృతం చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు చెప్పారు. ప్రతిఒక్కరూ దేశ సమైఖ్యతకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఖండ సంఘచాలక్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవులంతా ఐక్యంగా ఉండాలి

సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్

దుద్యాల్: యాదవులందరు ఐక్యంగా ఉంటూ, అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుర్ర రాఘవేందర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశానికి నర్సిములుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలని సూచించారు. అనంతరం పోలేపల్లి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు పెంటయ్య, చంద్రయ్య, నర్సిములు, నరసింహ, వెంకటేశ్, ముని కుమార్, వెంకటేశ్, సారంగి, నరేశ్, మల్లేశ్, కొడయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గ్రామ గౌరవ అధ్యక్షుడిగా గోపాల్, అధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా దీపక్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, చెన్నయ్య, వెంకటయ్య, మొగులయ్య, కోశాధికారిగా అంజిలయ్య, కార్యదర్శులుగా మల్లప్ప, మల్లేశం, అంజిలయ్య, ఆనంద్, వెంకట్, రాములు, సలహాదారులుగా కృష్ణయ్య, మన్నెయ్య, ఎల్లప్పతో కమిటీని ప్రకటించారు.

రిజర్వేషన్ బిల్లు పెట్టి సాధించుకుందాం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ

అనంతగిరి: 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో పెట్టి సాధించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం అఖిలపక్షం ఢిల్లీకి వెళ్లి ఈ విషయం గురించి ప్రధానమంత్రితో మాట్లాడాలని సూచించారు. బిల్లు ప్రాముఖ్యతను నరేంద్రమోదీకి వివరించి పార్లమెంట్‌లో చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ బిల్లును పాస్ చేయించి 9వ షెడ్యూల్‌లో సవరణ చేసి తమిళనాడు తరహాలో అమలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని సలహాఇచ్చారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన హర్షీన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయం నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని స్థానిక నాయకులుబాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, మధు, ఆంజనేయులు పాల్గొన్నారు.

బాలాజీ దారి.. మురుగునీరు పారి



హిమాయత్‌నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

మొయినాబాద్: తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుకూరు బాలాజీ దేవాలయానికి ప్రతి రోజు వేల మంది భక్తులు వస్తుంటారు. ఎంతో భక్తితో దూర ప్రాంతాల నుంచి దైవ దర్శనం కోసం వచ్చే భక్తులకు మురుగునీరు స్వాగతం పలుకుతోంది. మున్సిపాలిటీలోని హిమాయత్‌నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు బయటకు వచ్చి రోడ్డుపై పారుతోంది. పరిసర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుండడంతో బాలాజీ ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయానికి 2 కిలోమీటర్ల దూరంలో మురుగునీరు ఇలా రోడ్డుపై పారుతోంది. గత ఆరునెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రిజర్వేషన్ అమలయ్యేవరకు పోరాటం

రిలే దీక్షలో సాధన సమితి సభ్యులు

షాబాద్: బీసీ రిజర్వేషన్ అమలే చేసేవరకు ఉద్యమం కొనసాగిస్తామని బీసీ రిజర్వేషన్ల సాధన సతిమి సభ్యులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో రజక సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేదాకా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల విషయంలో తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సందీప్, జంగయ్య, కుమ్మరి దర్శన్, కుమ్మరి శ్రీనివాస్, నక్క శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, లింగం, మాసయ్య, శ్రీశైలం, యాదయ్య, శ్రీను, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

ఎస్ఐ శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ విభాగంలో గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి ఎస్ఐ శ్రీకాంత్ హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందడంతో పాటు మేథోశక్తి పెరుగుతుందన్నారు. ప్రతినిత్యం క్రీడల సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణం పెంపొందుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం కబడ్డీలో గెలుపొందిన జట్టును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అభినందించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత, నర్మద, ఉమ, నిరోజ, అనిత, శ్రీలక్ష్మి, అబిద్‌హుస్సేన్, అశోక్‌కుమార్‌యాదవ్, భవాని, శ్రీశైలం, నెహమియా పాల్గొన్నారు.

అయోధ్యలో జానపద కళాకారుల ప్రదర్శన



రథయాత్రలో బోనంతో జిల్లా యువతి



పోతురాజుగా తాండూరు యువకుడు

భక్తులను శివమెత్తించిన కళారూపం

బొంరాస్‌పేట: అయోధ్య యోగ్‌లో నిర్వహిస్తున్న 'దీపోత్సవం–2025' ఉత్సవాలకు తెలంగాణ నుంచి జిల్లా జానపద కళాకారులు వివిధ ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకుంటున్నారు. ఆదివారం నగరంలోని సాకేత్ మహావిద్యాలయ్ నుంచి నిర్వహించిన భారీ రథయాత్రలో పోతురాజు విన్యాసాలు, శివసత్తులపూనకాలు అందరిని చిందులేయించాయని తెలిపారు. ఈ సందర్భంగా తమ కళాబృందాన్ని పలువురు అభినందించారని కళాబృందం బాధ్యులు వివరించారు. 15మంది కళాబృందం సభ్యులు కృష్ణయ్య, రమేశ్‌మాస్టర్, పెంటప్ప, మాణిక్యం, మనీషా యాదవ్, చిన్నారి, శ్రావణి, అనూశ, బుగ్గేశ్, సిద్ధు, నిఖిల్ యాదవ్, బ్రహ్మేంద్ర తదితరులు ఉన్నారని పేర్కొన్నారు.

వేంకటదాసు జీవిత చరిత్రపై సదస్సు

పూడూరు: తెలంగాణ ప్రముఖ వాగ్గేయకారుడు, ఉమ్మెంతల పీఠ వ్యవస్థాపకుడు రాకమచర్ల వేంకటదాసు జీవిత చరిత్ర, వారి కీర్తనల విశిష్టత, ప్రచారంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు అనంత సాహిత్య, సాంస్కృతిక వేదిక జిల్లా అధ్యక్షుడు తలారి ఆశీర్వాదం తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో 2026, జనవరిలో జాతీయ సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. వేంకటదాసు కీర్తనలు అనంత సాహిత్య, సాంస్కృతిక వేదిక ప్రచారం చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు తెలంగాణ సాహిత్య అకాడమీ సహకరించడం అభినందనీయమన్నారు. తెలంగాణ సాహిత్యంలో వాగ్గేయకారుడిగా వేంకటదాసు చేసిన కృషి అమోఘమన్నారు. ఉమ్మెంతల పీఠం ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ పీరం చెరువు పాఠశాలలో కార్యక్రమం నిర్వహించేందుకు సమాలోచనలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకుడు దోరవేటి చెన్నయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తూర్పుమల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు తుల్జారాం సింగ్ ఠాకూర్, సాంస్కృతిక కార్యదర్శి పసుపుల హన్మంతు, ఉమ్మెంతల పీఠ ప్రతినిధులు శ్రీపాద శ్రీనివాస శర్మ, బొబ్లాద్ రాఘవేంద్రాచార్యులు, అనంత వేదిక సభ్యులు ఎండుజహరుల్లా అన్సారీ, సదీదుద్దీన్ అన్సారీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కొండకల్‌లో రూ.5.30 కోట్లతో నిర్మించనున్న జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని వెలిమల గ్రామం నుంచి రంగారెడ్డి జిల్లాలోని తంగడపల్లి వరకు రేడియల్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఈ పనులకు ప్రభుత్వ పాఠశాల భవనం అడ్డుగా మారడంతో పాత భవనాన్ని కూల్చి, కొత్త హంగులు, అత్యాధునిక సామగ్రితో కోట్ల రూపాయలతో నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని స్పష్టం చేశారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు వ్యాపారవేత్తలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జీవన జ్యోతి, ఉపాధ్యాయుడు రఘునందన్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, పాడువు శ్రీనివాస్, కాశీనాథం, సురేందర్‌రెడ్డి, పాండురంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులకు నిధులు మంజూరు

కొడంగల్: పట్టణంలోని లాహోటి కాలనీ పార్కు నుంచి బాపల్లితండా చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీఆర్ఐఎఫ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.60కోట్ల నిధులు విడుదల చేసింది. లాహోటికాలనీలోని పార్కు నుంచి వినాయక చౌరస్తా, మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, టీటీడీ కల్యాణ మండపం, నాజ్‌ఖాన్‌పల్లి, చిల్‌ముల్‌మైలారం, బాపల్లితండా చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులతో కొడంగల్ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



గుంతల రోడ్డుపై పాదయాత్ర ప్రారంభిస్తున్న వివిధ గ్రామాల నాయకులు, యువకులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి కుంటుపడిందని పలువురు నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఆయా పార్టీల నాయకులు, యువకులు మేడిపల్లి గ్రామం నుంచి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో రోడ్లు దెబ్బతినడంతో ఆర్టీసీ బస్సులు సక్రమంగా రావడం లేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజమల్లేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.